క్లుప్తంగా

'స్పందన'కు 20 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 20 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆనంద్‌కుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ, ఆర్థిక సాయం



సురేష్‌ను పరామర్శిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్–1లో నివసిస్తున్న సురేష్‌కు ఇటీవల విజయనగరం వెళ్తుండగా ప్రమాదం జరిగింది. అతడు మద్దిపాలెంలోని ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడనే విషయం తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ సోమవారం అక్కడికి వెళ్లి పరామర్శించారు. సురేష్ కుటుంబ సభ్యులకు రూ.3 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో శ్యామ్, గణేష్, రవి, సాధు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

మురళీనగర్: అమరావతి విశ్వసాహితి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మాధవధార భరద్వాజ క్షేత్రంలో నిర్వహించిన సాహితీ సమ్మేళనం అలరించింది. పిల్లా అర్జునుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అడబాల సత్యనారాయణ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. కవి సమ్మేళనానికి పీఎల్‌వీ ప్రసాద్ సమన్వయకర్తగా వ్యవహరించారు. 11 మంది కవులు, రచయితలు పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు తదితరులు కార్యక్రమం నిర్వహించారు.

బాల కార్మిక వ్యవస్థపై పోస్టర్ ఆవిష్కరణ

ఎంవీపీకాలనీ: ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ ఫ్రో చైల్డ్ గ్రూప్, విశాఖ ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ రూపొందించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఎంవీపీ కాలనీ డీఆర్‌డీఏ భవన కార్యాలయంలో విశాఖ జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారి డి.వెంకటేశ్వరి ఈ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల సమష్టి కృషితోనే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. 18 ఏళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లలు పని చేయకూడదని చట్టంలో ఉందన్నారు. దాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాల్సిన అవసరముందని చెప్పారు. సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

మోగిన బడి గంట

- పాఠశాలలు పునఃప్రారంభం
- తొలి రోజు స్వల్పంగా హాజరైన విద్యార్థులు



మాధవధార హైస్కూల్‌లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందిస్తున్న కార్పొరేటర్ ప్రసాద్



మాధవధార ఉన్నత పాఠశాలలో తొలి రోజు విద్యార్థులకు సూచనలిస్తున్న హెచ్‌ఎం హేమలత

మురళీనగర్: బడి గంట మోగింది. వేసవి సెలవులు ముగియడంతో సోమవారం చిన్నారుల బుడిబుడి నడకలు ప్రాథమిక పాఠశాలల వైపు సాగాయి. హైస్కూళ్ల విద్యార్థులు నూతన విద్యా సంవత్సరంలో విద్యాభ్యాసానికి సిద్ధమవుతూ పాఠశాలలకు వచ్చారు. మురళీనగర్ పరిధిలోని మాధవధార జీవీఎంసీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, ఏఎస్సార్ నగర్‌లోని కె.కాలనీ హైస్కూల్, బర్మా క్యాంపు ప్రాథమిక పాఠశాలల్లో తొలి రోజు విద్యార్థుల సందడి నెలకొంది. మాధవధార హైస్కూల్‌లో విద్యార్థులకు హెచ్‌ఎం బి.హేమలత ఎకడమిక్ ఇయర్ గురించి వివరించి పలు సూచనలిచ్చారు. ఎండ వేడిమి దృష్ట్యా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు పాఠశాలలు పనిచేశాయి. ఈ నాలుగు పాఠశాలల్లో మొత్తం 2,151 మంది విద్యార్థులు నమోదయ్యారు. ఎండ తీవ్రతకు స్వల్ప సంఖ్యలో హాజరయ్యారు. ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు ఆదివారమే సమాచారం పంపించినప్పటికి ఎక్కువ మంది రాలేదు. హాజరు నమోదు పూర్తి స్థాయిలో ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని హెచ్‌ఎంలు చెప్పారు.

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి చరిత్రలో నిలిచారని 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ కొనియాడారు. మాధవధార జీవీఎంసీ హైస్కూల్‌లో నిర్వహించిన జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బడి ఈడు పిల్లలందరూ చదువుకోవాలనే సత్సంకల్పంతో విద్యా పథకాలకు సీఎం అత్యంత ప్రాధాన్యమిచ్చారన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా 801 మంది విద్యార్థులకు కార్పొరేటర్ ప్రసాద్ కిట్లు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.హేమలత, ఉపాధ్యాయులు, వైఎస్సార్‌సీపీ 50వ వార్డు నాయకులు భగాతి విజయ్‌కుమార్, భరణికాణ రామారావు, పైడి కృష్ణారావు మాస్టర్, ఎస్.నారాయణస్వామి, పి.అప్పారావు మాస్టర్, రామారావు, టి.నారాయణరెడ్డి, వేణు, శివరాం, పి.రామ్మోహన్, మురళీధర్, ఎస్.రమేష్, రాము, ఎస్.శ్రీను, త్రినాథ్, చిరంజీవి, అప్పారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

329 మంది విద్యార్థుల హాజరు

సీతమ్మధార: పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో తొలి రోజు తక్కువ మంది విద్యార్థులు తరగతులకు హాజరయ్యారు. ఎండల ప్రభావం ఉక్కువగా ఉండటంతో పూర్తి స్థాయిలో పాఠశాలకు రాలేక పోయారు. సీతమ్మధార పీ అండ్ టీ కాలనీలోని ఎన్‌ఎంసీహెచ్ స్కూల్‌కు 900 మందికి గానూ 329 మంది విద్యార్థులు హాజరయ్యారని హెచ్‌ఎం రాంప్రసాద్ తెలిపారు.

స్నేహితుల ముచ్చట్లు

సీతంపేట: మధురానగర్ జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, రాజేంద్రనగర్, ఎన్జీవోస్ కాలనీల్లోని జీవీఎంసీ పాఠశాలకు తొలి రోజు సగం మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. తమ స్నేహితులతో ముచ్చటిస్తూ కన్పించారు. వేసవి సెలవుల్లో ఏవిధంగా గడిపారో ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు.

ప్రతి గడపలో విశేష ఆదరణ



చైతన్యనగర్ వాసులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ పద్మారెడ్డి

సీతమ్మధార: నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో కొనసాగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రతి ఇంటి నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. జీవీఎంసీ 24వ వార్డు చైతన్యనగర్ (10861 39) సచివాలయం పరిధిలో సోమవారం కార్పొరేటర్ సాడి పద్మారెడ్డితో కలిసి కె.కె.రాజు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి వాటి బ్రోచర్లు అందజేశారు. చైతన్యనగర్ వాసుల సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం ఇటువంటి సంక్షేమ పథకాలను అమలు చేయలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రజాప్రతినిధులే గడప గడపకు వెళ్లి నివాసుల సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తున్నారని చెప్పారు. 2024లో మళ్లీ వైఎస్ జగనే సీఎం అవుతారని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో ఏపీడీ దుర్గాప్రసాద్, కిరణ్‌రాజు, డైరెక్టర్ రాయుడు శ్రీనివాస్, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు బి.రామిరెడ్డి, బాచీ, రఘురామ్, లావణ్య, శివరంజిని, కె.మురళీకృష్ణ, వెంకటేష్, నేపాల్ శ్రీను, సన్నీ, దుర్గానాయుడు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కంటి శుక్లాలపై అవగాహన అవసరం

ఆరిలోవ: కంటి శుక్లాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లో కంటి వైద్య నిపుణుడు డాక్టర్ పంకజ్ పరశురాం తెలిపారు. ప్రతి జూన్ నెలను శుక్లాల మాసంగా గుర్తిస్తారు. దీంతో ఆస్పత్రిలో కొద్ది రోజులుగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఆయన శుక్లాలపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. వయసు రీత్యా సాధారణంగా కంటిలో శుక్లాలు ఏర్పడతాయన్నారు. మధుమేహం, మూత్ర పిండాలు వ్యాధి, కంటి గాయాలు, కంటి ఇన్‌ఫెక్షన్ తదితర వాటితో బాధపడేవారితో పాటు ఏదైనా వ్యాధి కోసం దీర్ఘకాలిక మందులు వాడుతున్నవారిలో, పొగ తాగుతున్న వారిలోను ఈ శుక్లాలు పెరుగుతాయన్నారు. ఇవి వాహనాలు నడుపుతున్నప్పుడు, పుస్తకాలు చదువుతున్నప్పుడు ఆటంకంగా మారుతాయన్నారు. అందుకే వాటిని తొలగించుకోవాలని సూచించారు. ప్రస్తుతం శుక్లాల శస్త్ర చికిత్స పురోగతి చెందిందన్నారు. శస్త్ర చికిత్స అనంతరం కంటి అద్దాలు లేకుండా సమస్య పరిష్కరించవచ్చన్నారు.

సివిల్స్ ర్యాంకర్ ఆశ్రితకు సత్కారం



ఆశ్రితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శంకరరావు నాయుడు, స్కూల్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ హరగోపాల్ స్కూల్ పూర్వ విద్యార్థి నొపడ ఆశ్రితను స్కూల్ ప్రిన్సిపాల్, సిబ్బంది సోమవారం ఘనంగా సత్కరించారు. ఇటీవల విడుదలైన సివిల్స్ ఫలితాల్లో ఆశ్రిత మూడో ప్రయత్నంలోనే 315 ర్యాంకు సాధించింది. సాధారణ మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన ఆమె ప్రాథమిక విద్యా భ్యాసం రైల్వే న్యూకాలనీలోని ఇదే స్కూల్‌లో జరిగింది. సడలని ఆత్మవిశ్వాసంతో, అకుంఠిత దీక్షతో, తల్లిదండ్రుల, గురువుల ప్రోత్సాహంతో తాను ఈ స్థితికి చేరుకోగలిగానని ఈ సందర్భంగా ఆశ్రిత తెలిపారు. విద్యార్థి దశ నుంచే ఏదైనా సాధించాలనే తపన, ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు గమ్యం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తమ పాఠశాల పూర్వ విద్యార్థిని ఉన్నత స్థితికి చేరుకోవడం ఎంతో గొప్పగా ఉందని పాఠశాల హెచ్‌ఎం శంకరరావు నాయుడు ఆనందం వ్యక్తం చేశారు. 2018 సివిల్స్ సర్వీసెస్ ఫలితాల్లో తమ పూర్వ విద్యార్థి బి.లవణ్‌కుమార్ కూడా సివిల్స్ ఎంపికై నట్లు ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో ఆశ్రిత తల్లిదండ్రులు, సోదరుడు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్య దేవత బురుజుపేటలో కొలువుదీరిన కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరగనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనాలనుకునే భక్తులు రూ.1,116 రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన



ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో బైఠాయించిన అంగన్‌వాడీ కార్యకర్తలు

మద్దిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మద్దిపాలెంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సోమవారం దాదాపు వంద మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు నిరసన చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీడీపీవో రమణికుమారికి అంగన్‌వాడీ కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. ఇటు ఎంవీపీ.. అటు పెందుర్తి అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే సెక్టార్ మీటింగ్‌లకు హాజరయ్యేందుకు ఇబ్బందులు పడుతున్నామని వారు వివరించారు. సీడీపీవో మాట్లాడుతూ త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అట్టహాసంగా ఎర్నిమాంబ ఆలయ పునఃప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, ఆడారి ఆనంద్‌కుమార్



ఆలయంలో ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు చేస్తున్న వైవీ సుబ్బారెడ్డి

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం కాన్వెంట్ కూడలిలోని ఎర్నిమాంబ ఆలయ పునఃప్రారంభం సోమవారం అట్టహాసంగా జరిగింది. విశాఖ డెయిరీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ తన సొంత నిధులు రూ. 35 లక్షలతో ఆలయాన్ని పునర్నిర్మించారు. ఈ సందర్భంగా ఆలయ శిఖరంపై కలశ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు పులఖండం శ్రీకాంత్ శర్మ, వేదపండితులు గణపతి పూజ, దీక్షాధారణ, వాస్తు యోగిని క్షేత్రపాలక నవగ్రహ సర్వతోభద్ర మండప పూజలు, అధివాసాలు, జలాధివాసం, క్షీరవాసం, ధాన్య, క్షయాధివాసాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ఆలయ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆయనకు ఆలయ కార్యనిర్వహణ అధికారి డి.వెంకట సత్యసురేష్‌బాబా, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్, ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడం జరిగిందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాజకీయాల్లోకి వచ్చినట్టు ఆయన తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, అదీప్‌రాజు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బెహరా భాస్కరరావు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సైకిల్ రైడర్ సంపత్‌కు అభినందనలు



సైకిల్ రైడర్ సంపత్‌ను అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: 'సే నో టు డ్రగ్స్' అనే నినాదంతో బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్ సరిహద్దుల వరకు సైకిల్ యాత్ర చేపట్టిన బుల్లయ్య కళాశాల విద్యార్థి సాయి సంపత్ ఈ నెల 2న విశాఖ చేరుకున్నాడు. యాత్ర విజయవంతంగా పూర్తి చేసిన సంపత్ సోమవారం కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన సంపత్‌ను ప్రత్యేకంగా అభినందించి యాత్రా విశేషాలను అడిగి తెలుసుకున్నారు. సైకిల్‌పై మే 8న విశాఖలో యాత్ర ప్రారంభించి 25 రోజుల పాటు సుమారు 2 వేల కిలోమీటర్లు ప్రయాణించి బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్ సరిహద్దుల వరకు యాత్ర సాగించినట్టు తెలిపాడు. కళాశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, స్నేహితుల సహకారంతో యాత్ర పూర్తి చేశానని, తెలుగు రాష్ట్రాల నుంచి సైకిల్‌పై మూడు సరిహద్దులను చేరుకున్న చిన్న వయస్కుడిగా రికార్డు సాధించానని చెప్పాడు. రోజూ 80 నుంచి 140 కిలో మీటర్లు ప్రయాణించే వాడినని.. తన యాత్ర అనుభవాలను వివరించాడు.

వలంటీర్లకు నియామక పత్రాల అందజేత



నియామక పత్రాలు అందిస్తున్న కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ

సీతమ్మధార: ఇటీవల నియామకమైన కొత్త వలంటీర్లకు నియామక పత్రాలు అందజేశారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు సూచనల మేరకు సోమవారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ, స్టాండింగ్ కమిటీ మెంబర్ బర్కత్ అలీ చేతుల మీదుగా వలంటీర్లకు వాటిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను పేదలకు అందించడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. కష్టపడి పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం కో–ఆర్డినేటర్ పీలా వెంకటలక్ష్మి, షేక్ బాబ్జీ, కె.చిన్నా తదితర నాయకులు పాల్గొన్నారు.

త్వరితగతిన వినతుల పరిష్కారం



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: ప్రజల వినతులను త్వరితగతిన పరిష్కరించాలని జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఆదేశించారు. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి నాలుగు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జెడ్సీ స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 02, రెవెన్యూకు 01, యూసీడీ విభాగానికి 01 చొప్పున అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్–1 టీఎస్‌ఎన్ రాజు, సూపరింటెండెంట్–2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ టి.ప్రసన్నరెడ్డి, వాటర్ వర్క్స్ ఈఈ–2 సూరిశెట్టి శేఖర్, డీఈ శ్రీనివాసవర్మ, టౌన్ ప్లానింగ్ టీపీవో శ్రీలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, సూపర్‌వైజర్ జనార్దన్, టీపీఆర్ వో ఏపీడీ కె.శైలజ, సచివాలయ అడ్మిన్లు పాల్గొన్నారు.

మనసుకు ఆనందాన్నిచ్చేది కవిత్వం



సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామితో కవులు, రచయితలు

సీతంపేట: కవిత్వం వింటే మనసుకు ఆనందం కలగాలని లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అన్నారు. లలితానగర్ లలితా పీఠం దర్బారు హాల్లో సోమవారం సాయంత్రం కవి సమ్మేళనం జరిగింది. అనంతరం కవులు, రచయితలను ఉద్దేశించి స్వామి వారు అనుగ్రహ భాషణం చేశారు. ఆనందం అంటే మనసు పరవశించే స్థితని పేర్కొన్నారు. అందరి ఆనందాల కంటే బ్రహ్మానందం గొప్పదని, కవిత్వం, సంగీతం, లలిత కళల వల్ల కలిగే ఆనందం ఇంచుమించు బ్రహ్మానందంతో సమానమన్నారు. మనిషి ఎన్ని క్షణాలు ఆనందాన్ని అనుభవించాడో అదే నిజమైన జీవితమని పేర్కొన్నారు. కవి సమ్మేళనంలో చక్కని పద్య, గద్య కవిత్వంతో అలరించారన్నారు. ఆగస్టు 10న లలితా పీఠంలో నన్నయ్య సహస్రాబ్ది ఉత్సవాలు జరుపుకుందామని తెలిపారు. అనంతరం కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులను దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి మహాస్వామిని, రచయితలు, కవులు డి.వి.సూర్యారావు, టి.పి.ఎస్.ఆచార్యులు, శేఖరమంత్రి ప్రభాకర్, చింతా ప్రభాకరరావు, రామతాత, చిన సూర్యనారాయణ, కావ్య, పిల్లా రమణమూర్తి, క్లోపల్లి వరలక్ష్మి, మరడాన సుబ్బారావు, కోరాడ నరసింహారావు, పద్మజ, ఎం.విజయగోపాల్, వేదుల కామేశ్వర శర్మ, గుండాన జోగారావు, సుజాతమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా కనకమాంబ తొలేళ్ల సంబరం



కనకమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



సీతంపేటలో ఉత్సవ ప్రతిమలను ఊరేగిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో కనకమాంబ

సీతంపేట: సీతంపేట గ్రామదేవత కనకమాంబ అమ్మవారి పండగ మహోత్సవంలో భాగంగా సోమవారం సాయంత్రం తొలేళ్ల సంబరం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు శివగణేష్‌శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. త్రిశక్తి ఆలయంలో ముగ్గురమ్మవార్లకు అమృత కుంబాభిషేకం, పంచామృత, కుంకుమ అభిషేకాలు జరిపారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. ఎరుకుమాంబ గుడి నుంచి భక్తులు అమ్మవారి ప్రతిమలు నెత్తిపై పెట్టుకుని సీతంపేట రాధాకృష్ణ ఆలయం వరకు తీసుకొచ్చారు. అక్కడ నుంచి నాయుడు వీధిలోని అమ్మవారి సదరం పట్టుకు తీసుకెళ్లి రాత్రంతా పూజలు చేశారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం అలరించింది.

నేడు ప్రధాన పండగ

కనకమాంబ అమ్మవారి ప్రధాన పండగ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిపేందుకు శ్రీకృష్ణ యువజన సేవా సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. త్రిశక్తి ఆలయాన్ని చూడముచ్చటగా అలంకరించారు. మంగళవారం తెల్లవారుజామున 3.30 గంటలకు తొలిపూజ, అనంతరం ఉదయం 5 గంటల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకోవచ్చని ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి సంతోష్ తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి సంప్రదాయ, సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి అనుపు ఊరేగింపు ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండగను జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ కోరింది.

వడదెబ్బకు గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

అల్లిపురం: వడదెబ్బకు గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 10న సరస్వతి పార్కు సమీప కీ హోటల్ ఎదురుగా ఉన్న ఫాంటా ప్లాజా వద్ద ఫుట్‌పాత్‌పై ఎండకు తట్టుకోలేక చెట్టుకింద కూర్చున్నాడు. అలా కూర్చుని అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని 108లో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్యులు అతనిని పరిశీలించి అప్పటికే చనిపోయినట్లు తెలియజేశారు. దీంతో మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియలేదని పేర్కొన్నారు. మృతుడు సుమారు 40 సంవత్సరాలు వయస్సు కలిగి, 5 అడుగుల 3 అంగుళాల ఎత్తుకలిగి, బ్లూకలర్ షార్ట్, తెలుపు రంగు ఫుల్ హ్యాండ్ షర్టు వేసుకుని ఉన్నాడని తెలిపారు. అతని చేతిపై వి.రవిమమా అని పచ్చబొట్టు కూడా ఉందని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 0891–2783672, 9866111395 నంబర్లలో తెలియజేయాలని కోరారు.